క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో ఈ నెల 23న మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. 33/11 కేవీ విమస్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత, ఫీడర్ నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, షిర్డీసాయి వెటర్నరీ కాలనీ, చలపతినగర్, సంజీవినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

గురుకుల ప్రవేశాల్లో జిల్లా ఫస్ట్ ర్యాంక్



ఫస్ట్ ర్యాంకర్ మిథినేష్‌ను సత్కరిస్తున్న మండల విద్యా శాఖాధికారులు

మద్దిలపాలెం: గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో 15వ వార్డు వెంకోజీపాలెం జీవీఎంసీ స్కూల్ విద్యార్థి సిహెచ్.మిథినేష్ జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో మిథినేష్‌ను సీతమ్మధార మండల విద్యా శాఖాధికారి-1 రామారావు, విద్యా శాఖాధికారి-2 బాలామణి ఘనంగా సత్కరించారు. మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల 6వ తరగతిలో ప్రవేశానికి మిథినేష్ పరీక్ష రాసి జిల్లాలో ప్రథమ ర్యాంకు సాధించడం గర్వకారణమని విద్యా శాఖాధికారులు కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులకు అభినందించారు.

చురుగ్గా యూజీడీ పనులు



పిఠాపురం కాలనీలో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులు

మద్దిలపాలెం: పిఠాపురం కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గతంలో కొన్ని వీధుల్లో మిగిలిపోయిన వాటిలో ఈ పనులు ప్రారంభించారు. ప్రొక్లెయిన్లతో గోతులు తవ్వుతున్నారు. వాటిలో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్లు వేస్తున్నారు. దీంతో కాలనీలో వీధులు ప్రస్తుతం గోతులమయంగా మారాయి. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్‌కు చెక్కు అందిస్తున్న దాత వెంకట లక్ష్మీనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని బాలాజీ గార్డెన్స్‌కు చెందిన గరిమెళ్ల సార్య వెంకట లక్ష్మీనారాయణ లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో విరాళాన్ని చెక్కు రూపంలో సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజుకు బుధవారం అందించారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు. దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం

- గోతులతో నిండిన జాతీయ రహదారి
- అవస్థలు పడుతున్న వాహన చోదకులు
- మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి



మద్దిలపాలెం జంక్షన్‌కు సమీపంలో ప్రమాదకరంగా గోతులు



మద్దిలపాలెం - ఇసుకతోట రోడ్డు మధ్యలో ఆటోమోటివ్ వద్ద గోతులు

మద్దిలపాలెం: నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిపై గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఇటు వెంకోజీపాలెం నుంచి ఇసుకతోట, మద్దిలపాలెం, గురుద్వారా వరకు రోడ్డుకు ఇరువైపులా ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ పరిస్థితి తలెత్తింది. గోతుల రహదారిపై ప్రయాణిస్తున్న వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి మరమ్మతులు చేయించకపోవడంతో వాహన చోదకులు గోతులను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వెంకోజీపాలెం నుంచి గురుద్వారా వరకు..

వెంకోజీపాలెం నుంచి వయా ఇసుకతోట, మద్దిలపాలెం మీదుగా సత్యం జంక్షన్, గురుద్వారా జాతీయ రహదారి ఎక్కడికక్కడ గోతులతో నిండిపోయింది. వెంకోజీపాలెం నుంచి ఇసుకతోట సిగ్నల్ వరకూ ఒక మోస్తారు బాగానే ఉన్నా.. ఇసుకతోట నుంచి మద్దిలపాలెం వరకు గల రోడ్డు గోతులతో నిండిపోయింది. మద్దిలపాలెం నుంచి గురుద్వారా వరకు అన్నీ గోతులే దర్శనమిస్తాయి. ఈ గోతులు పెద్దవిగా ఉండటంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఢీకొంటున్న వాహనాలు..

హైవేకు మధ్యలో పెద్ద పెద్ద గోతులు ఉండటంతో వాటిని తప్పించుకు వెళ్లే క్రమంలో వాహనాలు ఒకదానినొకటి ఢీకొని దెబ్బతింటున్నాయి. మరోవైపు గోతుల్లో పడిన వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో వేలాది రూపాయలు చేతి సొమ్ము ఖర్చు చేసి వాహనాలను బాగుచేయించుకోవాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. కొన్నిసార్లు వేగంగా వచ్చే వాహనాలు ఈ గోతులను చూసి సడన్ బ్రేక్ వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో ద్విచక్ర వాహన చోదకులతోపాటు ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ గోతులు నీటితో నిండిపోతున్నాయి. వాహన చోదకులు గమనించకుండా వాటిలో దిగడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. హైవేపై ఏర్పడిన గోతులను పట్టించుకోకపోవడంపై వాహన చోదకులు మండిపడుతున్నారు. గోతులు పూడ్చివేసి, వాహన చోదకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన అధికారులు తమకేం పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై దృష్టి సారించి తక్షణం మరమ్మతులు చేయించాలని వాహన చోదకులు కోరుతున్నారు.



హైవేపై కళాభారతి కూడలిలో ఏర్పడిన గోతులు



కృష్ణా కళాశాల జంక్షన్ నుంచి ఇసుకతోట రహదారిలో మధ్యలో గోతులు

రహదారులను బాగుచేయాలి



జాతీయ రహదారి గోతులతో నిండిపోయింది. ప్రయాణ సమయంలో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయి. గోతుల వల్ల వాహనాలు దెబ్బతినడంతోపాటు బ్యాక్ పెయిన్ వస్తోంది. అధికారులు స్పందించి వెంటనే రహదారులకు మరమ్మతులు చేపట్టాలి.

– కె.ఎస్.ఎస్.రెడ్డి, మద్దిలపాలెం

పార్కులో పచ్చదనం మాయం



హనుమంతవాక వద్ద ఎండిపోయిన పార్కు

ఆరిలోవ: హనుమంతవాక కూడలి వద్ద బీఆర్‌టీఎస్ రహదారిలోని పార్కులో పచ్చదనం మాయమైంది. కూడలి నుంచి విమ్స్ గేటు వరకు రెండు లైన్‌ల మధ్య ఉండే పార్కులో జీవీఎంసీ అధికారులు గతేడాది వివిధ రకాల మొక్కలు నాటించారు. పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన లేన్‌లు ప్రస్తుతం ఎండిపోయాయి. ఈ పార్కుపై సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతో పచ్చదనాన్ని కోల్పోయిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం ఇక్కడ మొక్కలకు నీరు పోసేవారు లేకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని అంటున్నారు. ఈ పార్కులోనే కూడలి వైపు ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అక్కడి నుంచి విమ్స్ గేటు వరకు పార్కు లోపల పచ్చదనం ఎండిపోయింది. దీంతో పార్కు లోపలకు వెళ్లి ఎవ్వరూ సేదదీరడానికి ఆసక్తి చూపడం లేదు.

డంపింగ్ యార్డులో ఆస్పత్రి వ్యర్థాలు వేస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక డంపింగ్ యార్డులో ఆస్పత్రి వ్యర్థాలు వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ జోన్-2 ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ హెచ్చరించారు. ముడసర్లోవ డంపింగ్ యార్డులో ఆరిలోవ హెల్త్‌సిటీలోని పలు ఆస్పత్రుల నుంచి వెలువడుతున్న మెడికల్ వ్యర్థాలను వ్యానుల్లో తీసుకువెళ్లి వేసేస్తున్నారు. వర్షాలు కురుస్తున్నప్పుడు ఈ వ్యర్థాలు కరిగి రిజర్వాయర్‌లో కలుస్తున్నాయి. ఇందులో నీటినే జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు ఆరిలోవ ప్రాంతంలోని ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఈ సమస్యపై 'మూటల మాటున మెడికల్ వేస్ట్' అనే శీర్షికన ఈ నెల 20న 'సాక్షి'లో వెలువడిన కథనానికి జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు స్పందించారు. ఇందులో భాగంగా బుధవారం జోన్-2 ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ డంపింగ్ యార్డును సందర్శించారు. యార్డు ఇన్‌చార్జిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఉండగా.. ఆస్పత్రుల నుంచి మెడికల్ వ్యర్థాలు తీసుకొచ్చి ఇక్కడ ఎలా వేయగలుగుతున్నారని నిలదీశారు. దీనికి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. డంపింగ్ యార్డు ఇన్‌చార్జికి మెమో ఇస్తామని ఈ సందర్భంగా 'సాక్షి'కి ఏఎంహెచ్‌వో తెలిపారు. ఆస్పత్రుల నుంచి వ్యర్థాలు రాకుండా చర్యలు చేపడతామన్నారు. ఇంత వరకు ఎవరు వేశారో తెలుసుకుని వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రుల మెడికల్ వ్యర్థాలను కాపులుప్పాడ డంపింగ్ యార్డు వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చోటకు మాత్రమే తరలించాలన్నారు. మళ్లీ ముడసర్లోవ డంపింగ్ యార్డులో మెడికల్ వేస్టేజి వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రిజర్వేషన్ల వర్గీకరణ తీర్పును సమీక్షించాలి



ఏయూ మెయిన్ గేట్ వద్ద రాస్తారోకో చేస్తున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

విశాఖ సిటీ: ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని, దీనిపై కేంద్రం అఫిడవిట్ దాఖలు చేయాలని మాల జాయింట్ యాక్షన్ పోరాట కమిటీ, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్‌కు పిలుపునివ్వడంతో ఉద్యమకారులు బుధవారం ఏయూ స్కూల్స్‌ను మూయించారు. యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. అవుట్ గేట్ వద్ద ఉన్న షాపులను బంద్ చేయించారు. ఈ సందర్భంగా సమితి నాయకుడు డాక్టర్ బోరుగడ్డ మోహన్‌బాబు మాట్లాడుతూ వర్గీకరణపై తీర్పు దేశ పార్లమెంటరీ వ్యవస్థకు, రాజ్యాంగానికి పెనుముప్పుగా పరిణమిస్తుందని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఆర్థిక పరమైన అంశాలను జోడించి క్రిమిలేయర్ తీసుకురావడం రిజర్వేషన్లను పూర్తిగా నిర్మూలించే కార్యక్రమంలా ఉందని ఆరోపించారు. దీన్ని ప్రతి ఒక్క భారతీయుడు వ్యతిరేకించి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీల వర్గీకరణను, క్రిమిలేయర్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రొఫెసర్ జాన్, ప్రొఫెసర్ అర్జున్, ప్రొఫెసర్ సుబ్బారావు, ప్రొఫెసర్ సిద్ధయ్య, ప్రొఫెసర్ మునిస్వామి, ఆరేటి మహేష్, డాక్టర్ బి.సుబ్బయ్య, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ శిరీష్, డాక్టర్ సుధీర్ పాల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజా సంఘాల నాయకులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ హితంగా ఫొటోగ్రఫీ ప్రదర్శన



ఫొటోల ప్రదర్శనను తిలకిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

బీచ్‌రోడ్డు: వైజాగ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఫొటోగ్రఫీ ప్రదర్శన భావోద్వేగాన్ని కలిగిస్తోందని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. ప్రదర్శనలోని ఫొటోలు సమాజ శ్రేయస్సుకు వారధిగా నిలిచాయని పేర్కొన్నారు. 185వ ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటోల ఎగ్జిబిషన్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. ఫొటో జర్నలిస్టులు తీసిన ఫొటోలు అందరినీ ఆకర్షిస్తూ సందేశాత్మకంగా, సమాచారపరంగా, సమాజ హితంగా ఉన్నాయని, వారి సృజనాత్మకత ప్రశంసనీయమన్నారు. ఒక్కో ఫొటో ప్రాముఖ్యాన్ని ఫొటో జర్నలిస్టులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఈ ఫొటో ప్రదర్శనలో చాలా విషయాలు గమనించగలరన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ నిర్వహించిన జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో అవార్డులు పొందిన విశాఖ ఫొటో జర్నలిస్టులు పి.లీలామోహనరావు, ఎం.డి.నవాజ్(సాక్షి), పి.ఎస్.మూర్తి, కె.మురళీకృష్ణ(డెక్కన్ క్రానికల్), కె.ఆర్.దీపక్, వి.పి.రాజు(ది హిందూ), ఎస్.కనక, ఎ.శరత్‌కుమార్(టైమ్స్ ఆఫ్ ఇండియా), జి.సత్యనారాయణ(ఇండియన్ ఎక్స్‌ప్రెస్), ఫ్రీ లాన్సర్ బలివాడ గోపికృష్ణలను దుశ్శాలువాలతో కమిషనర్ సంపత్‌కుమార్ సత్కరించి అభినందించారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్‌ను వైజాగ్ ఫొటో జర్నలిస్టులు ఘనంగా సన్మానించి పర్యావరణహిత వినాయకుడి ప్రతిమను అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, మ్యూజియం క్యూరేటర్ కె.వి.రమణ, వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అధ్యక్షులు పి.ఎస్.మూర్తి, సెక్రటరీ జి.తిరుపతిరావు, కోశాధికారి టి.రాజా, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

23న మిజోరం గవర్నర్ రాక

మహారాణిపేట: మిజోరం గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు ఈ నెల 23న విశాఖ వస్తున్నారు. కోల్‌కతా నుంచి విమానంలో మధ్యాహ్నం 2.55 గంటలకు విశాఖ చేరుకుంటారు. ఇక్కడ నుంచి మధ్యాహ్నం 3.10 గంటలకు దసపల్లాలోని ఇంటికి వెళ్తారు. 24వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఇంటి నుంచి మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియానికి వెళ్లి అక్కడ జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. తిరిగి రాత్రి 7.45 గంటలకు ఇంటికి చేరుకుంటారు. 25 నుంచి 27వ తేదీ వరకు డ్యూటీ నుంచి డిశ్చార్జ్ అవుతారు. 28న మధ్యాహ్నం 3.15 గంటలకు ఇంటి దగ్గర బయలు దేరి విశాఖ విమానాశ్రయానికి వెళ్తారు. సాయంత్రం 5.40 గంటలకు విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎస్పీ



ఎస్పీ మురళీకృష్ణ దంపతులకు వెంకన్న చిత్రపటాన్ని అందజేస్తున్న బోగాది సన్యాసిరావు

మద్దిలపాలెం: కేఆర్‌ఎం కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామిని బుధవారం ఎస్పీ మురళీకృష్ణ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. వెంకన్న స్వామి చిత్రపటాన్ని ఎస్పీ దంపతులకు ఆలయ మేనేజర్ బోగాది సన్యాసిరావు అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కోశాధికారి టి.సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగ్రహానికి గురికాక తప్పదు



స్టీల్‌ప్లాంట్ దీక్ష శిబిరంలో పాల్గొన్న సీఐటీయూ నేత రాజు

సీతమ్మధార: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్ష శిబిరం బుధవారానికి 1,243వ రోజుకు చేరుకుంది. సీఐటీయూ జగదాంబ జోన్ ఆధ్వర్యంలో వై.రాజు అధ్యక్షతన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిటు నాయకుడు కె.చంద్రమోహన్ మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నాయకులు స్టీల్‌ప్లాంట్ వద్ద జరిపిన సమావేశంలో ప్రైవేటీకరణ చేయనివ్వమని హామీ ఇచ్చి కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. ఆ హామీ నిలబెట్టుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిటు నాయకులు ఎం.సుబ్బారావు, టి.కామేశ్వరరావు, చంద్రమౌళి, బంగారు నాయుడు, హోటల్ యూనియన్ నాయకులు ఎర్రి బాబు, ప్రకాష్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి 'చారిటీ బాక్సు' సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న చారిటీ బాక్సు సభ్యులు

బీచ్‌రోడ్డు: పోర్టు రోడ్డులో సైకిల్‌పై టీ అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్న వెంకటరావు గతేడాది లారీ ఢీకొని మృతిచెందాడు. దీంతో అతడి కుమారుడు మణికీర్తన్ చదువుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆ కుటుంబం చారిటీ బాక్సు సంస్థను ఆశ్రయించింది. మణికీర్తన్ నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ(బీఎస్సీ కంప్యూటర్స్) చదువుతున్నాడు. ఆ విద్యార్థి చదువుకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో ఆర్థిక సాయం అందించేందుకు చారిటీ బాక్సు ముందుకొచ్చింది. సెకండియర్ ఫీజు రూ.36 వేలు గతేడాది చెల్లించింది. ఇప్పుడు థర్డ్ ఇయర్ ఫీజు రూ.36 వేలును కళాశాల సిబ్బందికి బుధవారం చారిటీ బాక్సు సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా చారిటీ బాక్సు కార్యదర్శి దొలూరు శంకరరావు మాట్లాడుతూ రెండున్నర ఏళ్ల నుంచి తమ సంస్థ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఎందరికో అండగా నిలిచిందని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కె.శ్రీకాంత్, లక్కోజు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

మధురవాడ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పరిశుభ్రత గురించి సార్ప్ సంస్థ, సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా బుధవారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధ సబ్బుతో చేతులు కడుక్కున్నప్పుడు పాటించవలసిన 7 సూత్రాల గురించి వివరించారు. డీబీఎస్‌వి స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ ఏఎస్ కుమారి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల విజేతలకు అభినందనలు



విద్యార్థులతో కరస్పాండెంట్ మధుకుమార్

సీతమ్మధార: సత్యసాయి జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో విశాఖ జిల్లా జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీల్లో బుల్లయ్య డిగ్రీ కళాశాల బీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థి ఎల్.వెంకటేష్, ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఆర్.నిఖిల్ విశాఖ జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించారు. రేసపువానిపాలెంలోని బుల్లయ్య కాలేజీలో బుధవారం వీరిని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ తదితరులు అభినందించారు.

చిరంజీవి జన్మదిన వేడుకలు నిలుపుదల

బీచ్‌రోడ్డు: ఎటువంటి అనుమతులు లేకుండా సాగరతీరంలో నిర్వహిస్తున్న మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను మూడో పట్టణ పోలీసులు నిలిపివేశారు. నిర్వాహకులు ముందుస్తుగా పోలీసుల నుంచి ఎటువంటి అనుమతి తీసుకోకుండా విశ్వప్రియా ఫంక్షన్ హాల్ ఎదురుగా వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ హాజరు కావాల్సి ఉంది. అనుమతులు లేక వేడుకలు నిలిచిపోవడంతో చిరంజీవి అభిమానులు నిరాశకు గురయ్యారు.

కోల్‌కతా ఘటనపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ శ్రేణులు

డాబాగార్డెన్స్: కోల్‌కతా మహిళా జూనియర్ డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడి, హత్యకు పాల్పడ్డ నేరస్తులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఏఐడీఎస్‌వో నేతృత్వంలో విద్యార్థులు నిరసన తెలిపారు. ఎల్‌ఐసీ కార్యాలయం నుంచి కాంప్లెక్స్ మీదుగా ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. ఏఐడీఎస్‌వో నగర కమిటీ అధ్యక్షుడు కె. అఖిలాష్, ఉపాధ్యక్షుడు బి. సంతోష్, సభ్యులు చరణ్, ప్రవీణ్, హర్షవల్లి, పౌర చైతన్య వేదిక నేత సీహెచ్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో..

కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై లైంగిక వేధింపులకు నిరసనగా బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో బుధవారం సంస్థ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. సిటు నాయకురాలు మణి మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సాగర్, మీనాకుమారి, ఉమ, బుడ్డి దొర, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

సీతమ్మధార : జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం జరిగిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుదారు. మహిళా చట్టాలు సక్రమంగా అమలు చేయలేని ప్రభుత్వాలు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఇక్కడ మానవహారం అనంతరం ఆశీలమెట్ట, గురజాడ విగ్రహం జంక్షన్, సెంట్రల్ పార్కు మీదుగా గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆశ వర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి మేరీ, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, ఆర్‌పీ, సిటు నాయకులు ఎ.సీతాలక్ష్మి, ఎం.సుబ్బారావు, కుమారి, చంద్రమౌళి, శివ, రాజు, పి.వెంకటరెడ్డి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

గంజాయి రవాణాదారుడి అరెస్ట్

బీచ్‌రోడ్డు: గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. మంగళవారం రాత్రి ఏయూ ఇంజినీరింగ్ గ్రౌండ్ వద్ద గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్, మూడో పట్టణ పోలీసులు దాడులు నిర్వహించారు. బెహరా సంతోష్ అనే వ్యక్తి 1.5 కేజీల గంజాయి రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు బుగ్గి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక:మాదక ద్రవ్యాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ గాజువాకలో విద్యార్థులు కదం తొక్కారు. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో బుధవారం భారీ సంఖ్యలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాతగాజువాక జంక్షన్ నుంచి బయల్దేరిన ర్యాలీ సినిమా హాల్ జంక్షన్ మీదుగా కొత్తగాజువాక జంక్షన్ వరకు కొనసాగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ మధ్య కాలంలో యువత వ్యసనాలకు బానిసలుగా మారి అనేక నేరాలకు పాల్పడుతోందన్నారు. మహిళలపై దాడులు పెరిగాయన్నారు. మహిళలకు పని ప్రదేశాల్లో రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని వైద్య విద్యార్థి హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.రాము, ఎల్‌జీ నాయుడు, నాయకులు సాయి, గుణ, కుసుమ, మౌని, అజయ్, నిఖిల్, సతీష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.